మహాసభలను విజయవంతం చేయాలి

బండ్లగూడ: రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో నిర్వహించనున్న తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుభాష్ పిలుపునిచ్చారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గండిపేట మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా యూనియన్ సుభాష్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 14, 15 తేదీలలో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలకు కార్మికులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ ఉపాధ్యక్షులు సురేష్, మల్లేష్, రాజు, రాము, కోశాధికారి రావుల కొల్లు నరేందర్, శ్యామ్, సహాయ కార్యదర్శులు నవీన్, లక్ష్మీనారాయణ, శ్రీధర్, అర్జున్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ జగన్, తౌఫిక్, వెంకటేష్, భారతమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

వైభవంగా అమానుల్లా షా ఖాద్రీ దర్గా ఉర్సు



ఉర్సులో పాల్గొన్న భక్తులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని హమీదుల్లానగర్ హజ్రత్ సయ్యద్ అమానుల్లాషా ఖాద్రీ దర్గా ఉర్సు ఉత్సవం వైభవంగా జరిగింది. స్థానికులు ఉర్సులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రార్థనలు నిర్వహించి కానుకలు సమర్పించారు. దర్గా పెద్ద ముతావుల్లా మహ్మద్ మహబూబ్ ఖాద్రీ, మైనార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఫసీయుద్దీన్, విక్రీ, హుస్సేనియుద్దీన్ ఖాద్రీ ముల్తానీ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సందడి షురూ

శాస్త్రిపురం: దీపావళి సందడి మొదలైంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బస్తీలలో కుమ్మరులు తమ కులవృత్తైనా దీపాలను తయారు చేస్తున్నారు. పండుగకు 10 రోజులు సమయం మాత్రమే ఉండటంతో ఉదయం, సాయంత్రం దీపాలను తయారు చేస్తూ వాటిని ఎండ బెడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని రహదారులు దీపాలతో కనిపిస్తున్నాయి. ఈ సంవత్సరం వర్షాల కారణంగా దీపాల తయారీ తక్కువగా ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వాటి ధరలు పెరిగే అవకాశం ఉందంటున్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో పాము కలకలం



గుడిలో పామును పట్టుకున్న స్నేక్స్ సొసైటీ ప్రతినిధి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవులలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో ఉన్న జగన్నాథ స్వామి దేవాలయంలో పాము కలకలం రేపింది. శుక్రవారం ఉదయం ప్రతి రోజు మాదిరిగానే పూజకు తలుపులు తీసిన పూజారి వరదాచారికి అది కనిపించి బుసలు కొట్టింది. దాంతో అతను తలుపు వేసి ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ వారికి సమాచారం ఇవ్వటంతో ప్రతినిధి వచ్చి నాలుగు అడుగుల పొడవు ఉన్న జెర్రిపోతును పట్టుకున్నాడు. ఇలా పాములు కనిపించినప్పుడు వాటిని చంపకుండా స్నేక్ సొసైటీ వారికి ఫోన్: 83742 33366లో సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం పామును చిలుకూరు జింకల పార్కులో వదలిపెట్టారు.

విద్యా వ్యవస్థలో మార్పులు అవసరం

గన్‌ఫౌండ్రీ: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో, బోధన పద్ధతులు, పాఠ్యాంశాలపై మార్పులు అవసరమని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏడాది కాలంలో ఉన్నత విద్యలో అనేక మార్పులు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. శుక్రవారం రవీంద్రభారతిలో తపస్య కాలేజీ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల సమవర్తనోత్సవ్ పేరిట స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన వెయ్యి మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మానవ విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడానికి విద్య సంస్థలు కృషి చేయాలని కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ కామర్స్ విభాగం డీన్ ఆచార్య డాక్టర్ కె.కృష్ణ చైతన్య, తపస్య విద్య సంస్థల డైరెక్టర్ ఓగూరి శ్రీహరి పాల్గొన్నారు.

'చుక్కల మందు'కు సర్వం సిద్ధం



రేపు 'పల్స్ పోలియో' నిర్వహణకు సన్నద్ధం

- ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి
- రంగారెడ్డి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- మిగిలిన వారికి 13 నుంచి 15వ తేదీ వరకు ఇళ్ల వద్దే చుక్కలు
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి



అత్తాపూర్: పోలియో మహమ్మారిని భూస్థాపితం చేసి పోలియో రహిత సమాజ స్థాపన దిశగా అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీ నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమ ఏర్పాట్లను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో పూర్తి చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ... పల్స్ పోలియో నిర్వహణకు సంబంధించి వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 12వ తేదీన జరగనున్న సబ్ నేషనల్ ఇమ్యూనైజేషన్ దినోత్సవంలో భాగంగా పల్స్ పోలియో నిర్వహణ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

- హనుమకొండ, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలో ఈ పోలియో దినోత్సవం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో వివరించారు.
- 'భారతదేశ పోలియో రహిత దేశమే కానీ కొన్ని దేశాలల్లో పోలియో ఇప్పటికీ ఉంది, మళ్లీ తిరిగి వచ్చే అవకాశమూ లేకపోలేదు. మీ పిల్లలకు రక్షణ కల్పించడంలో ఎలాంటి తప్పులు చేయెద్దు. పోలియో చుక్కల మందును అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఇవ్వాలి' అని డాక్టర్ లలితాదేవి సూచించారు.
- పోలియో మహమ్మారిపై విజయం సాధించే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలియోను భూస్థాపితం చేసి తద్వారా దేశాభ్యున్నతికి తోడ్పడాలని ఆమె పిలుపునిచ్చారు.
- జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో పట్టణ ప్రాంతంలో 1,99,967 మంది, గ్రామీణ ప్రాంతాల్లో 2,20,944 మొత్తం 4,20,911 చిన్నారులు ఉన్నారని వివరించారు. 0–5 నుంచి సంవత్సరాల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లు వెల్లడించారు.
- పట్టణ ప్రాంతాల్లో 422 పోలియో చుక్కల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో 1129 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 155 మంది రూట్ సూపర్ వైజర్లు, 6204 మంది బూత్ టీమ్ మెంబర్లను నియమించామని డాక్టర్ లలితాదేవి స్పష్టం చేశారు. ఆయా బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ఆదివారం పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఎవరైనా మిగిలిన చిన్నారులకు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఇళ్ల వద్దకే వెళ్లి చుక్కల మందు వేస్తారని తెలిపారు. తల్లిదండ్రులు ఎక్కడ ఉన్నా ఆరోజు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆమె సూచించారు.

'ఆన్‌లైన్'తో మానసిక రుగ్మతలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శంషాబాద్: అవసరానికి మించి అత్యధిక సమయం ఆన్‌లైన్‌లోనే గడిపితే మీ మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావం తప్పదనే విషయాన్ని గుర్తించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.హిమబిందు విద్యార్థులకు సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కళాశాలలో మానసిక ఆరోగ్యంపై సాంకేతిక వినియోగం అనే అంశంపై అవగాహన కల్పించారు. మొబైల్ ఇతర గాడ్జెట్‌లతో అత్యధిక సయం గడుపుతున్న వారు తమ మానసిక పరిస్థిలు నియంత్రించుకోవడంలో విఫలం అవుతున్నారన్నారు. మానసిక సమతుల్యత దెబ్బతినకుండా సాంకేతిక అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భానుప్రకాష్, ఆర్థిక శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి చేయూత



మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: పేద విద్యార్థుల చదువుకు అడ్డంకులు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేస్ ఆధ్వర్యంలో డాక్టర్ పోతన్న వద్ద వర్క్ చేస్తూ చదువుకుంటున్న శివరాంపల్లికి చెందిన నిరుపేద విద్యార్థిని షేక్ మతిన్‌కు కాలేజీ ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉన్న ఆమెకు కాలేజీ ఫీజు, అడ్మిషన్ కోసం మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి వివరించి సహాయం కోరారు. దీనికి స్పందించిన సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డిలు షేక్ మతిన్ చదువు కోసం అయాన్ ఇన్స్‌టిట్యూట్ కాలేజీలో సీటు ఇప్పించడంతో పాటు నాలుగు సంవత్సరాల ఫీజును చెల్లించి ఆమెను ఆదుకున్నారు. పేదలకు అండగా ఉండే నాయకులుగా చదువుల సరస్వతికి కాలేజీ సీటు ఇప్పించినందుకు సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ శ్రీను, శంకర్, రామకృష్ణ, ముంబై రవి, శేఖర్, తిమ్మప్ప, డాక్టర్ మనుష్ రెడ్డి, ప్రసన్న, పద్మమ్మ, పుష్ప, భావన, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ట్రస్మా' అధ్యక్షుడిగా బాబురావు



నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ మండల ప్రైవేట్ పాఠశాలల విద్యా సంస్థల సంఘం (ట్రస్మా) మండల అధ్యక్షుడిగా అవుసూరి బాబురావు, ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్‌రెడ్డి, కోశాధికారిగా రాజులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు నియామక పత్రాలను అందజేసి ప్రతినిధులను సన్మానించారు. నూతన అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. పూర్తి కమిటీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. రాష్ట్ర కన్వీనర్ వినయ్, జిల్లా తాత్కాలిక అధ్యక్షుడు గుల్షని, జిల్లా కోశాధికారి మల్లెల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు మూర్తి, అనంతలక్ష్మి, శిరీష, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూలీలను ఎయిర్ గన్‌తో బెదిరించిన వ్యక్తిపై కేసు

గోల్కొండ: గృహపకరణాలను ఇంట్లోకి తెస్తున్న కూలీలపై ఎయిర్ గన్‌తో బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదయ్యింది. టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..రాహుల్ కాలనీకి చెందిన కామ్‌రాన్ గత వారం తన రెండో అంతస్తులోని ఓ ప్లాట్‌ను అద్దెకు ఇచ్చాడు. శుక్రవారం సాయంత్రం అద్దెకు తీసుకున్న వ్యక్తి తన గృహపకరణాలను ఆటో ట్రాలీలో వేసి రాహుల్ కాలనీకి పంపాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కామ్‌రాన్ సామగ్రిని మెట్ల మార్గం గుండా పైకి తీసుకువెళ్లాలని కూలీలకు చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయాడు. కూలీలు లిఫ్ట్‌లో సామాన్లు తీసుకెళ్లడం గమనించిన కామ్‌రాన్ వారిని ఎయిర్ గన్‌తో బెదిరించాడు. ఈ విషయంపై కూలీలు టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానం

జియాగూడ: ధూల్‌పేట నవరాత్రి ఉత్సవ సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రతి యేటా మాతా రాణికా విశాల్ జాగరణ్ వైభవంగా నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానని సమితి అధ్యక్షుడు జితేందర్ సింగ్ అన్నారు. శుక్రవారం రహీంపురాలో ఉత్సవ సమితి సభ్యులు అధ్యక్షుడు జితేందర్ సింగ్, నూతన అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తాను సమితి సభ్యులు ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం జితేందర్ సింగ్ మాట్లాడుతూ..4 ఏళ్లుగా తాను అధ్యక్షుడిగా ఉంటూ ఎంతో వైభవంగా నిర్వహించేందుకు సమితి సభ్యులతో కలిసి కృషి చేశానన్నారు. వచ్చే సంవత్సరం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాడిశెట్టి సదానందంగుప్తా మాట్లాడుతూ..వచ్చే సంవత్సరం కూడా భారీ ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. సమితి చైర్మన్ శ్రీధర్‌బాబు, ప్రధాన కార్యదర్శి పిట్టల కృష్ణ, కోశాధికారి నిర్మేష సింగ్, సలహాదారులు ఎం.మహేష్, పి.రవీందర్ సింగ్, వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎస్.రాజన్‌కుమార్, టి.సచిన్ రాజ్‌సింగ్, పి.రంజిత్ కుమార్, రోమా అరోరా పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గంజాయి పట్టివేత

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం రాత్రి ప్రయాణికుడి నుంచి రెండు కేజీల గంజాయిని డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇండిగో 6ఈ–1068 విమానంలో హైదరాబాద్‌కు చెందిన తమీమ్ అన్సారి ఇబ్రహీం మరో సహచర ప్రయాణికురాలు షేక్ రేష్మాతో కలిసి బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాత్రి 7 గంటలకు చేరుకున్నాడు. విశ్వసనీయ సమాచారం డీఆర్‌ఐ అధికారులు అతడి బ్యాగేజీని తనిఖీ చేయగా అందులో హైడ్రోపోనిక్ విధానంలో పండించిన రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని డీఆర్‌ఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.


పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ప్రయాణికుడికి అందజేత



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ అనే ప్రయాణికుడు తాను ప్రయాణించిన కారులో మొబైల్‌ను పోగొట్టుకున్నట్లు ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వెంటనే సంబంధిత కారును ట్రేస్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫిర్యాదు అందిన గంటలోపే బాధితుడికి అందజేశారు. బాధితుడు పోలీసులు తీసుకున్న చర్యలపట్ల సంతోషం వ్యక్తం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కనకయ్య తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



థామస్

మణికొండ: కటింగ్ చేయించుకుని వస్తానని ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... హైదర్‌షా కోట్‌లోని రఘురాంనగర్ కాలనీకి చెందిన ఎం.థామస్(96) గురువారం ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి కటింగ్ చేయించుకుని వస్తానని వెళ్లారు. సాయంత్రం అయినా తిరిగి రాకపోవటంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ప్రయోజనం లేదు. దీంతో కుమారుడు విత్తన్ థామస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. వృద్ధుడి సమాచారం తెలిసిన వారు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణాసంచా పట్టివేత

విజయనగర్‌కాలనీ: అనుమతి లేకుండా నిల్వ ఉంచిన బాణాసంచాను స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం..ఆర్యసమాజ్ కార్వాన్, కుర్మాజీ గూడ కార్వాన్‌లో రెండు చోట్ల దాడులు జరిపి అనుమతి లేకుండా నిల్వ ఉంచిన సుమారు రూ.2 లక్షల విలువ చేసే బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు. ఆర్యసమాజ్ కార్వాన్‌కు చెందిన విజేందర్ సింగ్ (43), కుర్మాజీ గూడ కార్వాన్‌కు చెందిన టి.పురుషోత్తమ్ శంకర్(50)ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



స్వీపింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికులకు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లోని హిమాయత్‌సాగర్, 20వ డివిజన్‌లోని కాళీ మందిర్ జంక్షన్, 16వ డివిజన్‌లోని సన్‌సిటీ ప్రధాన రహదారులపై స్వీపింగ్ పనులను ఆయన పరిశీలించారు. రహదారిపై స్వీపింగ్ చేస్తున్న సమయంలో వేగంగా వచ్చే వాహనాలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. జి.వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు మీర్జా తౌఫిక్, నరేందర్, వెంకటేష్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి పరుస్తున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం ప్రాంతంలో అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను, దెబ్బతిన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులను జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముందుగా భూగర్భ డ్రైనేజీకి మరమ్మతు చేసిన అనంతరం నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని అధికారులకు బస్తీ వాసులకు సూచించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు పాండుయాదవ్, జీహెచ్‌ఎంసీ డీఈ దివ్యజ్యోతి, ఏఈ నర్సింహమూర్తి, భాను, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ లోకనాథ్, రావుల భాస్కర్, దేవులపల్లి స్వామి, నోముల పవన్‌యాదవ్, బుచ్చిరెడ్డి, ఎల్.వి.రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, శివ, రాజు, నిఖిల్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ హరీష్, భాను, జీహెచ్‌ఎంసీ జవాన్ శేఖర్, విజయ్, ఎస్‌ఎఫ్‌ఏ సంగీత, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు శాస్త్రీయంగా సాగాలి

బీసీ సంక్షేమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్



బండ్లగూడ: బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నా ప్రభుత్వ నిర్వాకం కారణంగానే హైకోర్టు స్టే విధించిందని బీసీ సంక్షేమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఆర్.కృష్ణముదిరాజ్ అన్నారు. బండ్లగూడ జాగీర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ తరపున వాదనలు శాస్త్రీయమైన, సమగ్రంగా వినిపించలేక పోయారన్నారు. దీనివల్ల బీసీల రాజకీయ భవిష్యత్తు, ఆత్మగౌరవానికి పెను విఘాతం సంభవించిందన్నారు. ఇకనైనా బీసీల రాజకీయ భవిష్యత్తును కాపాడాలని ప్రభుత్వానికి విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, హైకోర్టు, సుప్రీం కోర్టులోను శాస్త్రీయమైన వాదనను సమగ్రంగా సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వానికి సూచన చేస్తున్నామన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల ప్రారంభం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న హరీష్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తు సకాలంలో పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు హరీష్‌గౌడ్ సూచించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ చొరవతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోని బైరాగిగూడ, శివసాయినగర్ కాలనీలలో అండర్ గ్రౌండ్ సెంట్రల్ డ్రైనేజీ పనులను రూ. 22 లక్షల వ్యయంతో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లి నిధులను మంజూరు చేయించుకోని పనులను చేపడుతున్నామన్నారు. ఈ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేసేలా చూస్తామన్నారు. నాయకులు రాంప్రసాదరావు, రాజు, రామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

రాయదుర్గం: నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ అనేది ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ రంగాలకు చెందిన విభిన్న పారిశ్రామిక వృత్తులలో శిక్షణ, మార్గదర్శక సలహాలను అందిస్తుందని నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ డైరెక్టర్ డాక్టర్ సుహాస్ దేశముఖ్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో గ్రౌండ్ వాటర్ రీచార్జ్ టెక్నిక్స్ అండ్ మేనేజ్‌మెంట్ శిక్షణా తరగతుల ముగింపు సమావేశాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో శిక్షణ ఇవ్వడం ద్వారా దేశంలోని లక్షలాది మంది పేద మధ్య తరగతి కుటుంబాలు ఈ వృత్తులపైనే ఆధారపడుతూ జీవిస్తున్నారన్నారు. శిక్షణ అనే పదానికి చివర ఉండదని శిక్షణ ద్వారా ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వర్‌రావు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ మిషన్ ఫర్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ కింద మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఈ శిక్షణను ఎస్కీ విజయవంతం చేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్కీ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ ఫ్యాకల్టీ జి నరేష్, రిసోర్స్ పర్సన్ బివిరావు, సాయికిషోర్, ఆఫీస్ ఇన్‌చార్జ్ ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన



మల్కంచెరువు వద్ద రోడ్డును పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ ట్రాఫిక్ అధికారులు

గచ్చిబౌలి: ట్రాఫిక్ సమస్యలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ జాయింట్ సీపీ గజరావు భూపాల్ ,డీసీపీ, ఏడీసీపీ, ఏసీపీ, జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ బోర్ఖడే హేమంత్ సహదేవ్‌రావు ,ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్లు, వాటర్‌లాగింగ్ పాయింట్లు, కూడళ్ళు, రోడ్ల విస్తరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ ట్రాఫిక్ అధికారులు రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఖాజాగూడ జంక్షన్, రాయదుర్గం, మల్కంచెరువు పరిసరాలను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని, ఖాజాగూడ జంక్షన్ విస్తరణ చేస్తే మేలు చేకూరుతుందని, వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతాయని వెంటనే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

మెహిదీపట్నం డివిజన్‌లో విద్యుత్ అధికారుల పర్యటన

గోల్కొండ: బస్తీబాటలో ఆకస్మిక తనిఖీల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖి అన్నారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి మెహిదీపట్నం డివిజన్‌లోని అయోధ్యనగర్, జానకీనగర్, రేతిబౌలి, సంతోష్‌నగర్, తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న ఎల్‌టీ ఓవర్ హెడ్ కండక్టర్ల స్థానంలో ఎయిర్ బంచడ్ కేబుల్ ఏర్పాటు చేయాలని సూచించారు. లోడ్ గ్రోత్ ఉన్న ప్రాంతాల్లో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆయన తన వెంట ఉన్న అధికారులను ఆదేశించారు. గత వారం రోజులుగా తాము నిర్వహిస్తున్న బస్తీబాట కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులను నేరుగా కలుసుకునే అవకాశం లభిస్తుందన్నారు. డైరెక్టర్ ఆపరేషన్స్ నర్సింహులు, మెట్రో జోన్ సీఈ ప్రభాకర్, సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న, డీఈ సుధీర్‌కుమార్ తదితరులున్నారు.